# 22వ వార్డులో ఎస్ఐఆర్ ప్రచారాన్ని ముమ్మరం చేసిన కౌన్సిలర్ శివకిరణ్



తొలి సమయం, ఇల్లందు;జులై, 15:
భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 22వ వార్డులో కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను అందజేసి, వాటిని సకాలంలో పూర్తి చేసి బూత్ లెవల్ అధికారులకు సమర్పించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, పేరు, చిరునామా మార్పులు, వివరాల సవరణకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని శివకిరణ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు, వార్డు సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధుకర్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: నాయిని శ్రీనివాస్ రెడ్డి

తొలి సమయం, బయ్యారం; జులై, 15:



పీఏసీఎస్ మాజీ పీఐసీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డికి సంబంధించిన వ్యవహారంలో జిల్లా సహకార అధికారి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రికవరీ ప్రక్రియను పూర్తి చేసి, చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలని బయ్యారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీని వాస్ రెడ్డి కోరారు. జిల్లా సహకార అధికారి ఉత్తర్వుల ప్రకారం మధుకర్ రెడ్డిని పీఐసీ చైర్మన్ పదవి నుంచి తొలగించడంతో పాటు, ఆయనకు చెల్లించిన గౌరవ వేతనం, టీఏ/డీఏ మొత్తాలను రికవరీ చేయాలని, సంబంధిత చట్టాల ప్రకారం క్రిమినల్ ఫిర్యాదు నమో దుకు కూడా ఆదేశాలు జారీ అయినట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అలాగే, మధుకర్ రెడ్డిని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పదవి నుంచి తొలగించి, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని ఆయన కోరారు. అక్రమాలకు పాల్పడిన వారిపై నిష్పాక్షిక విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు.

# బిఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లాలి

**అందుబాటులో లేని వారి వివరాలు గుర్తించాలి**

**జిల్లా కలెక్టరేట్ మేజిస్ట్రేట్ స్నేహ శబరిష్**



తొలి సమయం మహబూబాబాద్ జూలై 15
బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కురవి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎనుమరేషన్స్ ఫార్మ్స్ పంపిణీ చేయడం పూర్తి అయ్యిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతుందని క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి బూతు లెవల్ అధికారులు వెళ్లి వివరాలు సేకరించి 2002 ఓటరు జాబితా ప్రకారం వివరాలు సేకరించాలని, అందుబాటులో లేని వివరాలను గుర్తించాలని, వేగంగా ఈ ప్రక్రియ మొత్తం కొనసాగాలని ఆదేశించారు, ఇప్పటికే జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగడంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు, కలెక్టర్ వెంట తహసిల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణంలో కాంట్రాక్టర్ అలసత్వం?

**రూ.1.43 కోట్ల పనులు ఆరు నెలలుగా నత్తనడకన..**

**నాణ్యతపై స్థానికుల ఆరోపణలుభవన నిర్మాణాన్ని త్వరగా**

**పూర్తి చేయాలని ప్రజల డిమాండ్**



తొలి సమయం, నర్సింహులపేట/మరిపెడ జూలై 15
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అడ్డంకిగా మారిందనే విమర్శలు నర్సింహులపేట మండల కేంద్రంలో వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణ పనులు గత ఆరు నెలలుగా నత్తనడకన సాగుతుండడంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి భారీ మొత్తాన్ని మంజూరు చేసింది. అయితే పనులు ప్రారంభమైనప్పటి నుంచి ఆశించిన వేగంతో సాగకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రోజులు గడుస్తున్నా నిర్మాణంలో పెద్దగా పురోగతి కనిపించకపోవడంతో ఈ భవనం ఎప్పుడు పూర్తవుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌తో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటింపజేసి, నిర్మాణాన్ని వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ దరఖాస్తులు సకాలంలో సమర్పించి రసీదు పొందాలి

**బి ఆర్ ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు అండ్**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు**

**దిండిగాల రాజేందర్**



తొలి సమయం,ఇల్లందు;జులై, 15:
ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ () కార్యక్రమంలో భాగంగా ఇల్లందు పట్టణంలోని నెం.2 బస్తీలో గల తన స్వగృహంలో ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రాలను పూర్తి చేసి, తమ వార్డుకు నియమితులైన బూత్ లెవల్ అధికారి శారదకు తమ కుటుంబ సభ్యులు మొత్తం 11 మందికి సంబంధించిన దరఖాస్తులను అందజేసి రసీదు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బూత్ లెవల్ అధికారుల వద్ద నుంచి ఎస్ఐఆర్ పత్రాలు స్వీకరించిన ప్రతి ఓటరు వాటిని పూర్తిగా పూరించి సంబంధిత బూత్ లెవల్ అధికారికి సమర్పించి తప్పనిసరిగా రసీదు పొందాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ఏమ్యునరేషన్ ఫారం ల స్వీకరణను ఆగస్టు 3 వరకు( . ) గడువు పెంచారని, ఇప్పటివరకు ఎస్ఐఆర్ పత్రాలు అందని వారు వెంటనే తమ ప్రాంత బూత్ లెవల్ అధికారులను సంప్రదించి పత్రాలను పొందాలని కోరారు. పత్రాలు స్వీకరించిన వారు వాటిని పూర్తి చేసి తిరిగి సమర్పించకపోతే ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉన్నందున ప్రతి ఓటరు ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**మోసపోతే వెంటనే 1930కు కాల్**

**చేయండిజిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్**



తొలి సమయం మహబూబాబాద్ జూలై 15
మహబూబాబాద్ జిల్లాలో ఇటీవల సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్ సూచించారు. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (), సైబర్ హెల్ప్‌లైన్-1930 ద్వారా జిల్లాలో నమోదైన ఫిర్యాదుల ప్రకారం సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఇటీవల జిల్లాలో నమోదైన సైబర్ మోసాల వివరాలు ఇలా ఉన్నాయి. మరిపెడ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పెట్టుబడి వెబ్‌సైట్ ద్వారా 1,50,000 మోసం జరిగింది. నెల్లికుదురు పోలీస్ స్టేషన్ పరిధిలో అనధికారిక ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీ ద్వారా 3,50,000 కోల్పోయారు. దోర్నకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనధికారిక ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీ ద్వారా 1,00,000 నష్టం జరిగింది. కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో టెలిగ్రామ్ ట్రేడింగ్/ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో 1,71,000 మోసం చేశారు. కురవి పోలీస్ స్టేషన్ పరిధిలో మార్ఫింగ్ చేసిన నగ్న చిత్రాలతో బెదిరిస్తూ సెక్స్టార్షన్ ఘటన నమోదైంది. బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో యూపీఐ కలెక్ట్ రిక్వెస్ట్ (ఫోన్‌పే) మోసం ద్వారా 9,879 కోల్పోయారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా 49,000 మోసపోయారు. ఈ కాలంలో జిల్లాలో మొత్తం 7 సైబర్ ఫిర్యాదులు నమోదుకాగా, అందులో 6 ఆర్థిక మోసాలు, 1 సెక్స్టార్షన్ కేసు నమోదైంది. మొత్తం 8,29,879 మేర ఆర్థిక నష్టం జరిగినట్లు వెల్లడైంది. సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న పద్ధతులుఫేస్‌బుక్ ప్రకటనల ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ వెబ్‌సైట్లలో పెట్టుబడులు పెట్టించడం, టెలిగ్రామ్ ట్రేడింగ్ గ్రూపుల పేరుతో మోసాలకు పాల్పడటం, బ్యాంకు అధికారులు లేదా కంపెనీ ప్రతినిధులమని చెప్పి యూపీఐ కలెక్ట్ రిక్వెస్ట్‌లను ఆమోదింపజేయడం, బ్యాంకింగ్ వివరాలను సేకరించి అనధికారిక లావాదేవీలు నిర్వహించడం, వ్యక్తిగత ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించి డబ్బులు వసూలు చేయడం వంటి ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయని ఎస్పీ తెలిపారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి పథకాలను నమ్మవద్దు. తెలియని వ్యక్తులు పంపిన యూపీఐ కలెక్ట్ రిక్వెస్ట్‌లను ఆమోదించవద్దు. ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ, బ్యాంకు పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ పంచుకోవద్దు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ, వెబ్‌సైట్ విశ్వసనీయతను నిర్ధారించుకోండి. టెలిగ్రామ్, వాట్సాప్‌లో తెలియని ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపుల్లో చేరవద్దు. వ్యక్తిగత ఫోటోలు, వీడియోలతో బెదిరించినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు పంపవద్దు. బ్యాంకు ఖాతాలకు ట్రాన్సాక్షన్ అలర్ట్‌లను యాక్టివేట్ చేసుకుని లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలించండి. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా ... వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును ఫ్రీజ్ చేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండడంతో పాటు కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా వృద్ధులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపే విధంగా రైతులకు అవగాహన కల్పించాలి

**సుగంధ తైలం పంటల ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చు**

**వనపర్తి నుండి వచ్చిన సుగంధ తైలం రైతు మోతీబాయి ద్వారా అవగాహన,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



తొలి సమయం మహబూబాబాద్ జూలై 15
కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్ర, ఉద్యానవన శాఖ అధికారి జి.మరియన్న, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఎలక్ట్రిసిటీ, ఎస్ఈ సంబంధిత అధికారులతో కలిసి ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో (వర్షాభావం) పరిస్థితిల్లో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు ముగ్గు చూపే విధంగా అన్ని విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని వారికి అవగాహన కల్పించాలని సూచించారు, ప్రస్తుతం వాతావరణంలో వచ్చే మార్పుల ఎలినో ప్రభావం వలన వర్షాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున, రైతులు అధిక నీరు వినియోగించే పంటలకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని, పంట మార్పిడి ద్వారా అధిక లాభాలు చేకూరే, ఆయిల్ పామ్, కూరగాయలు, పూలు, పండ్ల పంటలు సాగు చేయాలని అందుకోసం క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు రైతులకు పరిస్థితులను సవివరంగా వివరించి అవగాహన కల్పించాలని అన్నారు, ఈ పంట నుండి నూనె తీసిన తర్వాత మిగిలిన పంట వ్యర్థాలను వంట చేరుకుగా, బూడిదను పంటకు ఎరువుగా వాడవచ్చు. సుశీల ఆరోమాటిక్ కంపనికి చెందిన డైరెక్టర్ సుశీల జైస్వాల్ ఈ పంట సాగు ప్రాముఖ్యత, బై బ్యాక్ అగ్రిమెంట్, మార్కెటింగ్ మొదలైన అంశాలను గిరిజన రైతులకు వివరించారు. ఈ నిమ్మ గడ్డి, సిట్రోనెల్ల నుండి తీసిన ఆయిల్ ను ఔషధ, సౌందర్య సాధన పరిశ్రమలలో, ఆహార పరిశ్రమలలో, సబ్బులు, అగర్ వత్తులు, దోమల నివారణకు, పరిమళ కొవ్వొత్తుల తయారీకి, గృహాలలో, వసతి గృహాలలో, కార్లలో అన్ని రకాలుగా పరిశుభ్రతకు, సువాసనకు పరిమళంగా వాడుతారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వయం సహాయక సంఘాల నుండి అధ్యక్ష, కార్యదర్శులు, కొత్తగూడ, గంగారం మండలాలకు చెందిన రైతులు, గ్రామీణ అభివృద్ధి అధికారులు, సిబ్బంది, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జి. మధు సూదన్ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్,జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, ఉద్యాన శాస్త్రవేత్త డా. ఎ. ప్రశాంత్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె. స్వరూప, కొత్తగూడ, గంగారం మండలాల మహిళా మండల సమాఖ్య అధ్యక్షులు మరియు కార్యదర్శులు పాల్గొన్నారు వీరితో పాటు వ్యవసాయ సహాయ సంచాలకులు మురళి, ఉద్యాన అధికారులు ఎ.జె. శాంతి ప్రియదర్శిని, యం. స్రవంతి, డి.పి.యం ఎ. శ్రీకాంత్, ఎ.పి.యం.లు బి. బాబు, రవీందర్, ఉపేందర్ పాల్గొన్నారు.

# కొమరారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో అవకతవకలపై రైతుల ఆందోళన



తొలి సమయం ఇల్లందు;జులై, 15:
ఇల్లందు మండలం, కొమరారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులకు చెల్లించాల్సిన నగదులో రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు తక్కువ జమ అవుతోందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అఖిల భారత రైతుకూలీ సంఘం () ఇల్లందు మండల అధ్యక్షుడు పూనెం కోటన్న, కార్యదర్శి మూడు మాలు తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు వివరాలకు, రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన మొత్తాలకు పొంతన లేదని రైతులు తమకు ఫిర్యాదు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. అలాగే గోనె సంచుల ఖర్చు, రవాణా చార్జీలు ఇప్పటికీ చెల్లించలేదని ఆరోపించారు. రైతులకు రావాల్సిన మొత్తాన్ని పూర్తిగా చెల్లించి సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఇల్లందు సొసైటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో పాటు జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని హెచ్చరించారు.

# అడ్వకేట్ భూక్యా రవి నాయక్‌కు బీఆర్ఎస్ నాయకుల నివాళి



తొలి సమయం, ఇల్లందు;జులై, 15:
ఇల్లందు పట్టణానికి చెందిన ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ భూక్యా రవి నాయక్ గారు బుధవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సందర్భంగా వారి పార్థివ దేహాన్ని బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బావ్ సింగ్ నాయక్, రైతు బంధు కమిటీ మాజీ అధ్యక్షుడు అడ్వకేట్ సువర్ణపాక సత్యనారాయణ, ఇల్లందు మండల మాజీ ఉపాధ్యక్షుడు దెరంగుల పోషం, సన రాజేష్, బజారు సత్యనారాయణ, ఉమారాజు, లవకుశ్ తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రవి నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన సదస్సు



తొలి సమయం మరిపెడ జూలై 15
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్య తండా గ్రామపంచాయతీలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం రోజున ప్రత్యేక సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జరుపుల కాలు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐబీ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) వినోద్ పాల్గొని రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, నీటి సంరక్షణ చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షపాతం సాధారణ స్థాయిలో లేకపోవడంతో రైతులు పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని సాగు ప్రణాళికను రూపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును జాగ్రత్తగా వినియోగిస్తూ ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జరుపుల కాలు నాయక్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే సమయంలో వారికి అవసరమైన అవగాహన కల్పించడం గ్రామపంచాయతీ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ఈ అవగాహన సదస్సు రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరచాలి..!

**- ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి**

**-గాలివారిగూడెం, అమృతండా గ్రామపంచాయతీలలో సర్వేలో..**

**-సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అల్వాల వీరయ్య**

తొలి సమయం మరిపెడ జూలై 15
ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అల్వాల వీరయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మరిపెడమండలంలోని గాలివారిగూడెం, అమృ నాయక్ తండా, గ్రామపంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సిపిఐ(ఎం) బృందం క్షేత్రస్థాయి సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. గాలివారిగూడెం యూపీఎస్ పాఠశాలలో 55 మంది విద్యార్థులు ఉండగా నలుగురు ఉపాధ్యాయుల పోస్టులు మంజూరైనప్పటికీ ఇద్దరిని డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపడంతో బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని వీరయ్య డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన పాత భవనం ప్రమాదకరంగా మారిందని, అందులో గబ్బిలాలు చేరి విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పుగా మారిందని ఉపాధ్యాయులు వివరించారు. దీనిపై పలుమార్లు పై అధికారులకు ప్రతిపాదనలు పంపినా వారు స్పందించలేదని తెలిపారు. వెంటనే ఆ భవనాన్ని కూల్చివేసి కొత్త తరగతి గదులు నిర్మించాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద నిర్మించిన మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని వెంటనే నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణ మధ్యలో వెళ్లే విద్యుత్ తీగలను భద్రత దృష్ట్యా వేరే మార్గానికి మళ్లించాలని కూడా కోరారు.

– అంగన్‌వాడీ ప్రహరీ గోడ, మంచినీటి సౌకర్యం కల్పించాలి
మరిపెడ మండలంలోని అమృనాయక్ గ్రామపంచాయతీ



పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడి పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో పశువులు ఆవరణలోకి వస్తున్నాయని, తాగునీటి సౌకర్యం లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే మంచినీటి వసతి కల్పించి ప్రహరీ గోడ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సర్వే కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి గుండగాని మధు సూదన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు జిన్నా లచ్చయ్య, అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.